క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి


రాజయ్య (ఫైల్)

ఎల్కతుర్తి : రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన టన ఎల్కతుర్తి మండలంలోని సూరారం గ్రామ శివారులోని హనుమకొండ–కరీంనగర్ ప్రధాన రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై జక్కుల పరమేశ్ కథనం ప్రకారం.. మండలంలోని పెంచికలపేట గ్రామానికి చెందిన పెరుమాండ్ల పెద్దరాజయ్య (70) తన మనుమడు లక్ష్మణ్ ద్విచక్ర వాహనంపై ఎల్కతుర్తి నుంచి పెంచికలపేటకు వెళ్తుండగా హుజురాబాద్ వైపు వెళ్తున్న ఓ భారీ వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోతున్న క్రమంలో ఎదురుగా మరో లారీ అతి వేగంగా రాగా అందులో ఉన్న వెదురు బొంగులు ద్విచక్ర వాహనికి తగలడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి లారీ మధ్యలో ఇరుక్కుపోయింది. దీంతో పెద్దరాజయ్య టైర్ల కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. లక్ష్మణ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పెద్దరాజయ్యను ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

లారీ ఢీకొని..


కిరణ్ (ఫైల్)

దామెర : లారీ ఢీకొని ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని ఊరుగొండ సమీపంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. శాయంపేట మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన గోరంట్ల కిరణ్ (30) వరంగల్‌లోని బంగారం దుకాణంలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడు పని ముగించుకుని తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా ఊరుగొండ సమీపంలో ములుగు వైపు నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిరణ్ అక్కడికక్కడే మృతి చెందాడు.

చికిత్స పొందుతున్న యువకుడు..



శాయంపేట : చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని మైలారం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై వీరభద్రరావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అరికిల్ల హరీష్ (37) ప్రైవేట్ జాబ్ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈనెల 3న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబీకులు ఆయన్ను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి భార్య ఝాన్సీరాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు..

నడికూడ : విద్యుదాఘాతానికి గురై దుక్కిటెద్దు మృతి చెందిన ఘటన మండలంలోని రాయపర్తి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కోరెం రాజిరెడ్డి తన వ్యవసాయ భూమిలో గుంటుక కట్టే క్రమంలో వేలాడుతున్న 11 కేవీ విద్యుత్ వైర్లకు తాగడంతో రెండు దుక్కిటెద్దుల్లో ఒక్కటి అక్కడికక్కడే మృతి చెందగా రైతుకు గాయాలయ్యాయి. సుమారు రూ.70 వేల నష్టం వాటిల్లిందంటూ బాధిత రైతు కుటుంబం కన్నీరుమున్నీరయ్యింది.

ఇద్దరికి గాయాలు

ఐనవోలు : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని పంథిని శివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా పరిధిలోని వర్ధన్నపేట మండలంలోని రామవరం గ్రామానికి చెందిన ఉడుత వెంకటయ్య, అతని కొడుకు అశోక్ వరంగల్ నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా పంథిని శివారులో ప్రమాదవశాత్తు రోడ్డుకు ఆనుకుని ఉన్న బండరాళ్లను బైక్ గుద్దుకుని కింద పడిపోయారు. వెంకటయ్య, అశోక్‌లకు బలమైన గాయాలు కావడంతో స్థానికులు వారిని 108 వాహనంలో వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. రోడ్డును ఆనుకుని బండరాళ్లు ఉండటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశమున్న నేపథ్యంలో అధికారులు స్పందించి రాళ్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు



శాయంపేట : మండలంలోని వసంతపూర్ గ్రామానికి చెందిన రైతు కూతురు విద్యాసాగర్ రెడ్డి (60)కి ఆయన కూతురు తలకొరివి పెట్టింది. వివరాలిలా.. విద్యాసాగర్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు కూతుర్లున్నారు. ఆయనకు కొడుకులు లేకపోవడంతో పెద్దకూతురు వర్షిత తలకొరివి పెట్టి దహన సంస్కారాలు నిర్వహించింది. ఈ ఘటన స్థానికులను కంటతడి పెట్టించింది.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

● సీడీపీఓ భాగ్యలక్ష్మి


నడికూడ : గర్భిణులతో సీడీపీఓ, తదితరులు


ఆత్మకూరు : పండ్లు అందిస్తున్న వరుణ్ గాంధీ


శాయంపేట : సీమంతం చేస్తున్న అంగన్‌వాడీలు

నడికూడ : పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ భాగ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని నడికూడ, రాయపర్తి, వరికోల్, కౌకొండ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు సోమవారం సామూహిక సీమంతాలు వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ భాగ్యలక్ష్మి మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గర్భిణులు, బాలింతలు వయసుకు తగ్గ ఎత్తు, బరువు ఉండేలా చూసుకోవాలని చెప్పారు. గర్భిణులకు అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ టీచర్లకు చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీదేవి, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం

ఆత్మకూరు : బీఆర్‌ఎస్ ప్రభుత్వం మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమిస్తోందని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు అర్షం వరుణ్ గాంధీ తెలిపారు. మండలంలోని నీరుకుళ్లలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సామూహిక సీమంతాలకు ఆయన హాజరై గర్భిణులకు పండ్లు, నగదు అందించి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు పౌష్టికాహారం అందుతోందని తెలిపారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులకు న్యూట్రీషన్ కిట్లు అందిస్తున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీల్లో బాలలకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు సాంబమూర్తి, అంగన్‌వాడీ టీచర్లు అరుణ, సుమలత, బుజ్జమ్మ, రమ, మనెమ్మ పాల్గొన్నారు.

శాయంపేట : స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు అంగన్‌వాడీ టీచర్లు సామూహిక సీమంతాలు నిర్వహించారు. గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే భోజనం చేయాలని, ఆహారంలో ఆకుకూరలు, కోడిగుడ్డు, పాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రత్నమాల, శ్వేత, కవిత, ఆశాకార్యకర్త కవిత పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో దేశానికే ఆదర్శం

● వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి


మాట్లాడుతున్న వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ జ్యోతి

పరకాల : రైతులకు, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని లలిత కన్వెన్షన్ హాలులో విద్యుత్ శాఖ పరకాల నియోజకవర్గ ప్రగతి వేడుకలు నిర్వహించగా ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ సాధించుకున్న తర్వాత సీఎం కేసీఆర్ కృషి ఫలితంగా కోతలు లేని విద్యుత్ సరఫరా అవుతోందని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ కష్టాలు తీరాయన్నారు. విద్యుత్ రంగంలో తెలంగాణ సాధించిన అభివృద్ధిని చూసి మిగతా రాష్ట్రాలు అమలుకు సిద్ధపడుతున్నాయని చెప్పారు. సమైక్య పాలనలో వేళాపాళా లేని విద్యుత్ కోతలతో రైతులు, ప్రజలు అనేక కష్టాలు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. స్వరాష్ట్ర ఏర్పాటుకు ముందు రాత్రి వేళల్లో రైతులు పొలాల వద్ద పడుకోవాల్సిన, విద్యుద్ఘాతానికి గురై అనేక మంది రైతులు మృతి చెందిన ఘటనలు ఉండేవన్నారు. తెలంగాణ సాధించుకున్నాక రైతులకు, ప్రజలకు విద్యుత్ సమస్యలు లేని పరిస్థితి నెలకొందని చెప్పారు. 24 గంటలూ విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) మోహన్‌రావు మాట్లాడుతూ స్వరాష్ట్రంలో తొలి విజయం విద్యుత్ శాఖకే దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో పరకాల ఏసీపీ జూపల్లి శివరామయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, సీఐ పుల్యాల కిషన్, ఎంపీపీ టి.స్వర్ణలత, జెడ్పీటీసీలు సిలువేరు మొగిలి, కోడెపాక సుమలత, మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి, విద్యుత్ నోడల్ అధికారి జగదీష్‌బాబు, ఇన్‌చార్జ్ డీఈ సాంబరెడ్డి, ఏడీలు దేవేందర్, నర్సింగరావు, ఏఈలు గజ్జల సత్యనారాయణ, రవికుమార్, రమేష్, విశ్వప్రసాద్, సంపత్‌రెడ్డి, ఏఈ తిరుపతిరెడ్డి, మధుసూదన్ పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలులో నిర్లక్ష్యం

● వ్యవసాయ మార్కెట్ ఎదుట రైతుల ధర్నా


ధర్నా చేస్తున్న రైతులు

కమలాపూర్ : మొక్కజొన్న కొనుగోలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఎదుట ప్రధాన రహదారిపై రైతులు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతులు విలేకరుల ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రానికి మొక్కజొన్నలు తీసుకొచ్చి 20 రోజులు గడుస్తున్నా నిర్వాహకులు బార్దాన్ సంచులు ఇవ్వకుండా, మొక్కజొన్నలను తూకం వేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని వాపోయారు. ఓవైపు అకాల వర్షాలకు పంట నష్టపోగా, అరకొరగా వచ్చిన మొక్కజొన్న పంట కాస్తా ఇటీవల కురిసిన వర్షానికి తడిసి కొట్టుకుపోయిందని తెలిపారు. మొక్కజొన్నలను రోజూ ఉదయం ఆరబోయడం సాయంత్రం కుప్ప పోయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకు వాతావరణంలో మార్పులు వస్తున్నాయని, మళ్లీ వర్షం కురిస్తే మొక్కజొన్నలు తడిసి మరింత నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే బార్దాన్ సంచులు ఇప్పించడంతోపాటు మొక్కజొన్నలను కొనుగోలు చేయించాలని డిమాండ్ చేశారు. ఎస్సై సతీష్ సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకుని రైతులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చి ఆందోళన విరమింపజేశారు.

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత

● బీసీఐఆర్‌ఏ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రీనివాస్


శాయంపేట : మాట్లాడుతున్న శ్రీనివాస్


ఆత్మకూరు : మాట్లాడుతున్న డాక్టర్ దామోదర్

శాయంపేట : పర్యావరణ పరిరక్షణను సమాజంలోని ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించాలని బీసీఐఆర్‌ఏ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ అనుముల శ్రీనివాస్ కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజ్వల్ రైతుల, ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో మండలంలోని తహరాపూర్, జోగంపల్లి గ్రామాల్లో సర్పంచ్ మౌనిక అధ్యక్షతన సోమవారం నిర్వహించిన అవగాహనా సదస్సులో శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. రైతులు, ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని మానేయాలని సూచించారు. పంటల సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగానికి మొగ్గు చూపాలని చెప్పారు. వరద నీటికి భూసారం కొట్టుకుపోకుండా గట్లపై 500 మొక్కలు నాటాలని రైతులకు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో అన్ని వర్గాల ప్రజలూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ప్రజ్వల్ సంస్థ క్షేత్ర సిబ్బంది, పీయూ మేనేజర్ హిమవర్షిణి, అసోసియేషన్ మేనేజర్ అక్కల రమేష్, సిబ్బంది పన్నాటి రాంబాబు, రవిచందర్, మనోహర్, ప్రశాంత్, సునీల్, తిరుపతి, హిమబిందు, భానుమతి, కల్పన, నవయువ సొసైటీ డైరెక్టర్ జంగిలి రవీందర్, కానుగంటి సదానందం, పున్నం దేవేందర్‌రెడ్డి, కరుణాకర్, సమ్మిరెడ్డి, కుక్కల మల్లయ్య, ఎల్లయ్య, నిమ్మల పైడి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండలంలోని పెద్దాపూర్ గ్రామంలోని రైతు వేదికలో పర్యావరణ పరిరక్షణపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సెంటర్ ఫర్ వరల్డ్ సాలిడారిటీ సంస్థ సభ్యుడు, రిసోర్స్‌పర్సన్ డాక్టర్ దామోదర్ మాట్లాడారు. కాలుష్య నివారణపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కాలుష్య నివారణ విషయంలో ప్రభుత్వానికి ప్రజలు సహకరించాలని కోరారు. గ్రామాల్లో ప్లాస్టిక్ నిషేధించాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సావురే కమల రాజేశ్వరరావు, సంస్థ సభ్యుడు కొమ్ముల నవీన్, ఏఈఓ చిత్రిత, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


బడిబాటలో హెచ్‌ఎం శ్రీనివాస్, తదితరులు

ఐనవోలు : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ (ఎంపీపీఎస్) ప్రధానోపాధ్యాయుడు జీ.శ్రీనివాస్ స్పష్టం చేశారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం విద్యార్థుల నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు బడిబాటకు సంబంధించిన ఫ్లెక్సీతో గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకతను వివరించారు. అనంతరం హెచ్‌ఎం శ్రీనివాస్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ విద్యాబోధన అందించడంతోపాటు మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, తదితరాలు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ‘మన ఊరు–మన బడి’లో భాగంగా పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగు పర్చిందని చెప్పారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ముందుకు సాగుతున్నాయని తెలిపారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పాలని కోరారు. కాగా ఆరుగురు విద్యార్థులకు ప్రవేశాలు కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.మధూకర్, కె.మహేందర్‌రెడ్డి, ఆర్.లక్ష్మయ్య, భీమళ్ల సారయ్య, అంగన్‌వాడీ టీచర్లు రాజేశ్వరి, పద్మ, సమ్మక్క, యశోద, రేణుక, దీపిక తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


విద్యార్థికి పురస్కారం అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

ధర్మసాగర్ (వేలేరు) : మండలం నుంచి ఇద్దరు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేసినట్లు పీఆర్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెన్నం రవీందర్‌రెడ్డి, ఎర్రం తిరుపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి మండల టాపర్లుగా నిలిచిన వేలేరు టీఎస్‌ఆర్‌ఎస్ విద్యార్థి ఇ.మనోజ్, జెడ్పీ హైస్కూల్ విద్యార్థి బంక అక్షయ్ కుమార్ పురస్కారాలు అందుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మనోజ్, అక్షయ్‌కుమార్‌లను వేలేరు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం నాగకుమారి, పీఆర్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెన్నం రవీందర్‌రెడ్డి, ఎర్ర తిరుపతి, ఉపాధ్యాయులు సీను విద్యానంద్, స్వరూప రాణి, హున్యానాయక్, భానుప్రసాద్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, డి.శ్రీనివాస్, టీఎస్‌ఆర్‌ఎస్ ప్రిన్సిపాల్ తదితరులు అభినందించారు.

ముళ్లపొదలు ఇలా.. ప్రయాణం ఎలా..

● అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం


రోడ్డుపైన ప్రమాదకరంగా ఉన్న ముళ్లపొదలు

శాయంపేట : మండల కేంద్రం నుంచి కొత్తగట్టు సింగారం స్టేజీ వరకు బీటీ రోడ్డు పక్కన ఉన్న ముళ్లపొదలు రోడ్డును సగానికి కమ్మేస్తుండడంతో ఎలా ప్రయాణం సాగించాలని ద్విచక్ర వాహనదార్లు బెంబేలెత్తుతున్నారు. సదరు బీటీ రోడ్డు పక్కనున్న ముళ్ల చెట్లు పెరిగి భారీ వృక్షాలై రోడ్డును సగానికి కమ్మేశాయి. మూలమలుపుల్లో ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించని దుస్థితి నెలకొంది. తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. శాయంపేట నుంచి హనుమకొండకు ఇది దగ్గరి దారి కావడంతో వందలాది వాహనాలు ఈ దారిలో రాకపోకలు సాగించడం పరిపాటి. అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం రాకపోకలు సాగిస్తారు. ఇకనైనా తుమ్మ చెట్లను, ముళ్ల పొదలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

హెలీపాడ్ పనులను పరిశీలించిన అధికారులు

● 7న కేటీఆర్ రాక..


హెలీపాడ్ పనులను పరిశీలిస్తున్న ఏసీపీ శివరామయ్య

దామెర : ఈనెల 7న మండలంలోని దుర్గంపేట్‌కు మంత్రి కేటీఆర్ రానున్న సందర్భంగా హెలీపాడ్ పనులను అధికారులు సోమవారం పరిశీలించారు. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కూతురు జాహ్నవి వివాహ విందు వేడుకలు దుర్గంపేట్ సమీపంలోని ఎస్‌ఎస్‌ఆర్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఈ వేడుకకు కేటీఆర్ హాజరు కానున్నారు. కన్వెన్షన్ హాల్‌కు సమీపంలో హెలీప్యాడ్ ఏర్పాటుకు సంబంధించిన పనులను పరకాల ఏసీపీ జూపల్లి శివరామయ్య, సీఐలు కుమార్, కిషన్, ఆర్ అండ్ బీ ఎస్ఈ నాగేంద్రబాబు పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, నాయకులు కాంతాల కేశవరెడ్డి, ఎస్‌ఎస్‌ఆర్ సంస్థల అధినేత నాయినేని సంపత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ఇవ్వాలి

● తహసీల్దార్‌కు సమ్మె నోటీస్ అందజేత


తహసీల్దార్‌కు సమ్మె నోటీస్ అందజేస్తున్న డీలర్లు

కమలాపూర్ : రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు పుల్లూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో డీలర్లు తహసీల్దార్ పాలెపాక రాణికి సోమవారం సమ్మె నోటీస్ అందజేశారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల జేఏసీ పిలుపు మేరకు ఈనెల 5 నుంచి సమ్మె చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. అనంతరం సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండలంలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

జిల్లా సాధన పోరాటానికి మద్దతు


కమిటీకి మద్దతు తెలుపుతున్న నాయకులు

పరకాల : పరకాల జిల్లా సాధన కోసం బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటానికి స్థానిక ఫొటోగ్రాఫర్స్, ఫోర్‌వీలర్స్ అసోసియేషన్లు మద్దతు తెలిపాయి. పట్టణంలోని అమరధామంలో జిల్లా సాధన కమిటీని ఆ యూనియన్ల నాయకులు సోమవారం కలిసి మద్దతు ప్రకటించారు. పరకాలను అమర వీరుల జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా సాధన కమిటీ చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఆ యూనియన్లు పేర్కొన్నాయి. కార్యక్రమంలో బీజేపీ హుస్నాబాద్ పాలక్ డాక్టర్ సంతోష్‌కుమార్, భద్రాద్రి జిల్లా కొత్తగూడెం ప్రభారి దేవునూరి మేఘనాథ్, పరకాల పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, జిల్లా సాధన కమిటీ కన్వీనర్ దుబాసి వెంకటస్వామి, కౌన్సిలర్ కొలనుపాక భద్రయ్య, పరకాల పట్టణ అవుట్‌డోర్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల శ్రీధర్, బీజేపీ నాయకులు బాసాని సోమరాజ్, విజయ్, సంగా పురుషోత్తం, పిట్ట వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

తరుగు పేరుతో దోపిడీ తగదు


సమావేశంలో మాట్లాడుతున్న నాగుల పవన్ కల్యాణ్

శాయంపేట : తరుగు పేరుతో రైతులను దోపిడీ చేయడం తగదని అంబేద్కర్ విద్యార్థి సమాఖ్య (ఏబీఎస్‌ఎఫ్) జిల్లా కన్వీనర్ నాగుల పవన్ కల్యాణ్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓవైపు ప్రకృతి వైపరీత్యంతో పంట నష్టం వాటిల్లగా మరోవైపు తరుగు పేరిట అన్నదాతలను మిల్లర్లు నిలువునా దోచుకుంటున్నారని తెలిపారు. తేమ, గడ్డి, తాలు పేరుతో క్వింటాకు 5 కిలోల మేర తరుగు తీస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని, రైతులను దోపిడీ బారి నుంచి కాపాడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కొంగర విజయ్, సభ్యులు తరుణ్ నరేష్, మనోజ్, మహేష్, కన్నా తదితరులు పాల్గొన్నారు.

‘పోలీస్ హౌసింగ్’ చైర్మన్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న నాయకులు

కమలాపూర్ : మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ 61వ జన్మదిన వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్యవైశ్య సంఘ భవనంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. తదనంతరం సంఘం మండల, పట్టణ అధ్యక్షులు భూపతి రాజు, కొనిశెట్టి మునీందర్ మాట్లాడారు. దామోదర్ ప్రభుత్వానికి, వైశ్య సమాజానికి ఎనలేని సేవలు అందిస్తున్నారని కొనియాడారు. రానున్న రోజుల్లో దామోదర్ మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ఉన్నతంగా ఎదిగి సామాజిక సేవల్లోనూ పాలుపంచుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శులు వెనిశెట్టి పున్నంచందర్, సుద్దాల కార్తీక్, నాయకులు నూక సంపత్‌కుమార్, నూక సాంబమూర్తి, వెనిశెట్టి శివకుమార్, నూక వీరభద్రయ్య, అయిత ఓంప్రకాష్, జగదీశ్వర్, కృష్ణమూర్తి, రమేష్, ప్రవీణ్, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

జీపీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

ఎల్కతుర్తి : గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భీమదేవరపల్లి మండలంలోని సర్పంచ్‌లకు కారోబార్లు సోమవారం వినతిపత్రాలు అందజేశారు. తమను పర్మినెంట్ చేయాలని, పీఆర్సీలో నిర్ణయించిన మినిమమ్ బేసిక్‌ను వేతనంగా చెల్లించాలని, అప్పటివరకు జీఓ నంబర్ నెంబర్ 60 ప్రకారం స్వీపర్లకు రూ.15 వేల 600, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.22,750 వేతనం చెల్లించాలని, జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, ప్రతినెలా సకాలంలో వేతనాలు చెల్లించాలని, వేతన బకాయిలు తక్షణమే విడుదల చేయాలని, జీఓ నంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కారోబార్ల సంఘం మండల అధ్యక్షుడు నీలం కుమార్, నాయకులు శ్రీనివాస్, మహిబాబు, నీలం సమ్మయ్య, రాగిళ్ల సారయ్య, పట్ల ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.